క్లుప్తంగా

ఆకట్టుకుంటున్న స్టార్



వెంగాపురం చర్చి వద్ద ఏర్పాటుచేసిన స్టార్

బలిజిపేట: మండలంలోని వెంగాపురం విచారణ సర్వేశ్వరుని మాతా దేవాలయంలో ఫాదర్లు కె.ఆనంద్, రవితేజల ఆధ్వర్యంలో యువత ఏర్పాటుచేసిన స్టార్ పలువురిని ఆకట్టుకుంటోంది. పర్యావరణ కాలుష్యానికి దూరంగా ఉండేలా కొబ్బరితాళ్లతో దీనిని తయారుచేసినట్లు ఫాదర్ తెలిపారు. దీని చుట్టూ ఒక రోప్‌ను ఏర్పాటుచేశామని, దీనిపై ఎటువంటి ప్లాస్టిక్ పేపర్లు, ఇతరత్రా కాలుష్యానికి సంబంధించిన రంగు పేపర్లు లేవన్నారు.

బుడ్డిపేటలో ఇంటింటి కుళాయిలు

సీతానగరం: మండలంలోని పెదభోగిలి పంచాయతీ బుడ్డిపేటలో ఇంటింటి కుళాయిల నిర్మాణానికి స్థల పరిశీలన చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్‌కుమార్ తెలియజేశారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ బుడ్డిపేట గ్రామంలో ప్రజలకు మంచినీటి సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వం రూ.24 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. పైప్‌లైన్‌లు వేయడానికి అవసరమైన ముడి సరుకు గ్రామానికి చేరవేసినట్లు తెలియజేశారు. కొత్తబుడ్డిపేట, పాగబుడ్డి గ్రామాల్లో ప్రధాన పైప్‌లైన్‌లు వేసి 150 ట్యాప్‌లు ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. ప్రతి ఇంటికీ కుళాయిలు వేయనున్నట్లు తెలియజేశారు. ఇప్పటికే పెదభోగిలి మేజర్ పంచాయతీలో ఉన్న మూడు గ్రామాల్లో ఇంటింటి కుళాయిల పనులు పూర్తి కావచ్చాయని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ పాలక వర్గ సభ్యులు ఎస్.వెంకటరమణ, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

నేడు రైతులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సాలూరు: మండలంలోని రైతులకు గురువారం 3 ఫేజ్ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని డీఈ అనంతరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవుబుచ్చింపేట సబ్‌స్టేషన్ నుంచి మామిడిపల్లి సబ్‌స్టేషన్ మధ్య విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలు తొలగించే పనులు చేపడుతున్నామని చెప్పారు. కావున గురువారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 3 ఫేజ్ కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని కోరారు. గృహాలకు యథావిధిగా కరెంట్ ఉంటుందని తెలిపారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగి ఉడాలి



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పార్వతీపురంటౌన్: అగ్నిప్రమాదాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండి చుట్టుపక్కల వారిని చైతన్యవంతులను చేసి ప్రమాదాలు నియంత్రించవచ్చునని పార్వతీపురం అగ్నిమాపక శాఖ అధికారి పి.పైడిరాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం పార్వతీపురం పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలకు కారణమయ్యే గాలి, మండే పదార్థం, వేడి ఈ మూడింటిలో ఒక దానిని అదుపుచేస్తే ప్రమాదాలు నియంత్రించవచ్చని సూచించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తదితర ప్రమాదాలు ఏ విధంగా ఎదుర్కొవాలో తెలియజేశారు. ఇళ్లలో వంట గ్యాస్ ప్రమాదాల నుంచి ఎలా తప్పించుకోవాలి? ఎలా నియంత్రించాలి? అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది రమేష్, డి.గోపీమోహన్ కుమార్, టి.త్రినాథ, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా అభయాంజనేయ స్వామి ఆలయ ప్రారంభం



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న రంగునాయుడు

మక్కువ: మండలంలోని మార్కొండపుట్టి గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణ కర్త అత్తులూరి రామచంద్రరావు, సునీత దంపతుల ఆధ్వర్యంలో ఆలయ ప్రారంభోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు ఎస్‌వీఎల్ఎన్ శర్మ యాజీ, గాడేపల్లి రామలక్ష్మి నరసింహ శర్మలు, సిందూరం, తమపాకుల అర్చన, ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు ఆంజనేయస్వామిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.



నిర్మాణమవుతున్న వందపడకల ఆస్పత్రి



నిర్మాణమైన కొత్తవలస సచివాలయ భవనం



నిర్మాణమైన కరాడవలస బీటీ రోడ్డు

సంక్షేమాభివృద్ధి ధ్యేయంగా పాలన

- సాలూరు నియోజకవర్గంలో శరవేగంగా పనులు
- రూ.1628 కోట్లకు పైగా సంక్షేమం,
- రూ.1300 కోట్లతో అభివృద్ధి పనులు



నిర్మాణంలో ఉన్న టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, పక్కనే టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ (ఫైల్)

సాలూరు: ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న పాలనలో భాగంగా సాలూరు నియోజకవర్గంలో ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర ప్రత్యేక చొరవతో సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సాలూరు నియోజకవర్గంలో సుమారు 8,14,539 మంది లబ్ధిదారులకు రూ.1,628 కోట్లకు పైగా వివిధ సంక్షేమ పథకాల ద్వారా నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ అయింది. నియోజక వర్గంలో ఇంతవరకు కనీవినీ ఎరుగని రీతిలో సుమారు రూ.1300 కోట్లతో భవనాలు, వంతెనలు, సీసీరోడ్లు, బీటీ రోడ్లు తదితర అభివృద్ధి పనులు జరిగాయి, మరిన్ని జరుగుతున్నాయి. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యంగా పంచాయతీ రాజ్ (పీఆర్‌ఐ,పీఐయు), ఆర్‌అండ్‌బీ, ట్రైబల్ వెల్ఫేర్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల ద్వారా సుమారు రూ.1300 కోట్లతో 15,857 పనులు మంజూరయ్యాయి. ఇందులో ఇప్పటికి సుమారు 7వేల పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

ముఖ్యమైన డిపార్ట్‌మెంట్‌ల ద్వారా చేసిన పనులు వివరాలు

క్రమ సంఖ్య	డిపార్ట్‌మెంట్	మంజూరైన పనులు	అంచనా వ్యయం (కోట్లల్లో)
1	పంచాయతీరాజ్ (పీఆర్‌ఐ)	2720	87.10
2	పంచాయతీరాజ్ (పీఐయూ)	51	183.67
3	ఆర్‌అండ్‌బీ	55	152.50
4	ట్రైబల్ వెల్ఫేర్	536	183.37
5	ఇరిగేషన్	54	113.95
6	ఆర్‌డబ్ల్యూఎస్‌అండ్‌ఎస్	796	152.41
7	నాడు నేడు (హాస్పిటల్స్), వంద పడకల ఆస్పత్రి	7	28.37
8	ఏపీటిడ్కో ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్	5	90.52
9	మున్సిపల్ ఇంజినీరింగ్	333	24.05
10	నేషనల్‌హైవే	3	52.20
11	ఏపీఈపీడీసీఎల్	460	16.74
12	హౌసింగ్	10837	195.07

ప్రజాసంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన



ప్రజాసంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా అవినీతిరహితంగా అత్యంత పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నాం.మాది చేతల ప్రభుత్వమని మరోసారి చాటిచెబుతున్నాం.

– పీడిక రాజన్నదొర, ఉపముఖ్యమంత్రి

ఎన్నడూ ఇటువంటి పాలన చూడలేదు



గిరిజనుడినైన నేను గత టీడీపీ ప్రభుత్వ హయాంలో, నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోను రెండు సార్లు సర్పంచ్ అయ్యాను. ఇప్పటివరకు ఇంతటి సంక్షేమం, అభివృద్ధి పాలన ఏనాడూ చూడలేదు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర హయాంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందడంతో పాటు ముమ్మరంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. కోట్లాది రుపాయలతో కందులపథం వంతెన, బీటీ రోడ్లు తదితర అభివృద్ధి పనులు జరిగాయి. మరిన్ని పనులు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు.

–పీడిక సుదర్శనదొర, మావుడి సర్పంచ్, సాలూరు మండలం

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



వాక్యం అందిస్తున్న బ్రదర్ అబ్దుల్ జోసెఫ్



క్రీస్తు భక్తులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

మక్కువ: స్థానిక జీసస్ ప్రేయర్ హాల్ చర్చిలో పాస్టర్ సురగాల జయరాజు ఆధ్వర్యంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాక్యోపదేశకులు బ్రదర్ అబ్దుల్ జోసెఫ్ జీవము గల దేవుని సంఘం విశాఖపట్నం ముఖ్యఅతిథిగా హాజరై వాక్యం అందించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, ఏసుక్రీస్తు భక్తులకు గ్రీటింగ్స్ అందించారు. అనంతరం 200 మంది వృద్ధులు, వితంతువులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. క్రిస్మస్ వేడుకల్లో బ్రదర్ ఎం.సత్యనారాయణ, ఎలీసా బ్రదర్, బ్రదర్ తవుటన్న దొర, బ్రదర్ నగేష్ పాల్గొన్నారు.

శరవేగంగా సామాజిక భవనం పనులు



పనులను పరిశీలిస్తున్న ఏఈ చంద్రమౌళి, ఇంజినీరింగ్ సహాయకులు

సీతానగరం: .మండలంలోని పెదభోగిలి పంచాయతీ సుంకరివీధిలో నిర్మిస్తున్న సామాజిక భవనం పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకున్నామని ఇంజినీరింగ్ సహాయకులు సంతోష్‌కుమార్, పార్వతి అన్నారు. ఈ మేరకు బుధవారం కమలాతోటలో రూ. 20 లక్షలతో మండల ఇంజినీరింగ్ అధికారి చంద్రమౌళి పర్య వేక్షణలో జరుగుతున్న భవనం పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక భవనం పనులు ఫిబ్రవరి నెలాఖరు లోగా పూర్తి చేయడానికి నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారన్నారు. అలాగే పెదభోగిలి మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న రెండు సచివాలయ భవనాలకు గాను పెదభోగిలి-1సచివాలయ భవనం పూర్తి కావచ్చిందని పెదభోగిలి -2 సచివాలయ భవనం పనులు పూర్తికావడంతో ప్రారంభించడానికి సిద్ధంగా ఉందని తెలియజేశారు. రైతుభరోసా కేంద్ర భవనం పనులు పూర్తి కావచ్చాయని పనులను పూర్తి చేయాలని నిర్వాహకులపై ఒత్తిడి తీసుకువచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో సామాజిక భవనం కమిటీ సభ్యులు, తామరఖండి, బూర్జ సచివాలయాల ఇంజినీరింగ్ సహాయకులు మణిదీప్‌కుమార్, ఈర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఏర్పాట్లు పూర్తిచేయండి

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



రాష్ట్రస్థాయి క్రీడాపోటీల నిర్వహణపై ఆదేశాలు జారీ చేస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: పాచిపెంట మండలంలోని పి.కోనవలసలో జరగనున్న గురుకులాల అండర్-19 బాయ్స్ అండ్ గర్ల్స్ రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయనను పట్టణంలోని రాజన్నదొర స్వగృహంలో పి.కోనవలస బాలురు, బాలికల గురుకుల కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి క్రీడాపోటీల నిర్వహణపై రాజన్నదొర ఆరా తీశారు. పోటీలకు వచ్చే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో ఆరోగ్యకర వాతావరణంలో పోటీలు జరిగేలా చూడాలని కోరారు.

రైతులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు

మండలంలోని రైతులు, ప్రజలకు విద్యుత్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎలక్ట్రికల్ ఏఈ సింహాచలాన్ని ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఆదేశించారు. ఉపముఖ్యమంత్రి రాజన్నదొరను పట్టణంలోని ఆయన స్వగృహంలో ఏఈ బుధవారం కలిశారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ, తోణాంలో జగనన్న కాలనీలో నిర్మాణాలు జరుగుతున్నాయని, అటుగా హైలెవెల్ కరెంట్ వైర్లు వెళ్తుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని, సమస్య పరిష్కరించాలని సూచించారు.

ఓటరు నమోదు, సవరణ, తొలగింపు పరిశీలన

- తహసీల్దార్ ఎన్వీ రమణ
- పోలింగ్ కేంద్రాల సందర్శన



లచ్చయ్యపేటలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: మండలంలో డిసెంబర్ 9 వరకూ బీఎల్వోలకు వచ్చిన ఓటరు నమోదు, సవరణలు, తొలగింపుల దరఖాస్తులను పరిశీలించనున్నామని, పరిశీలనకు వచ్చిన వారికి ప్రజలు సహకరించాలని తహసీల్దార్ ఎన్వీ రమణ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓటరు నమోదు, సవరణలు, తొలగింపులు తదితర అంశాలపై గ్రామాల్లో ప్రజలతో అవగాహన సదస్సులను నిర్వహించేందుకు జోగింపేట, మరిపివలస, అప్పయ్యపేట, పెదంకలాం, కృష్ణాయరాయపురం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అలాగే రీ సర్వే డీటీ పి. చిట్టిమ్మ గుచ్చిమి, పెదభోగిలి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా లచ్చయ్యపేటలో జరిగిర అవగాహన సదస్సులో తహసీల్దార్ ఎన్వీ రమణ మాట్లాడుతూ అర్హులైన వారందరికీ బీఎల్వోలు ఓటుహక్కు హక్కు కల్పించడం కోసం ఎంత ప్రాధాన్యమిస్తారో, స్థానికంగా ఓటు ఉండి దీర్ఘకాలం వలసవెళ్లి స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్న వారి ఓట్లు తొలగించడానికి కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అలాగే ఓటర్ల జాబితాలో పేర్లుండీ తండ్రి పేరు లేదా, ఇంటిపేరు, భర్తపేరు, ఫోన్ నంబర్, ఆధార్ నంబర్‌లో ఏదైనా తప్పు దొర్లితే వాటిని మార్పు చేసుకునే వెసులుబాటు కల్పించాలని సూచించారు. బీఎల్వోలకు అవసరమైన సహకారాన్ని ప్రజలు, గ్రామపెద్దలు అందజేయాలని కోరారు. తప్పులులేని ఓటర్లజాబితా తయారు చేయాలని, అందుకోసం అందరూ సహకరించాలని, అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ కృష్ణ, ఎంపీటీసీ అక్కపోలు సింహాచలం, మాజీసర్పంచ్ వంజరాపు గుంపస్వామి, వీఆర్వోలు, బీఎల్వోలు పాల్గొన్నారు.

థర్డ్‌ఫేజ్ రీసర్వే వేగవంతం

అసలైన రైతులకు భూమి హక్కులు కల్పించడానికి ప్రభుత్వ భూముల పరిరక్షణకు రాష్ట్రప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చిందని తహసీల్దార్ ఎన్వీ రమణ, రీసర్వే డీటీ పి.చిట్టిమ్మ అన్నారు. ఈ మేరకు బుధవారం వారు తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న రీసర్వే పనుల్లో భాగంగా మండలంలో థర్డ్ ఫేజ్‌లో 7 గ్రామాలకు రీ సర్వే నిర్వహించాల్సి ఉందన్నారు. జగనన్న సమగ్ర 'భూ'రక్ష, భూ హక్కు పథకం థర్డ్‌ఫేజ్ రీసర్వే కార్యక్రమంలో భాగంగా ప్రస్తుతం వీర్వోలు, సచివాలయం సర్వేయర్ల ఆధ్వర్యంలో కూలీలు కోట సీతారాంపురం, కృష్ణారాయపురం గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

డయల్ యువర్ డీపీటీఓకు ఆరు వినతులు

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన డయల్ యువర్ డీపీటీఓ కార్యక్రమానికి ఆరు వినతులు వచ్చినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి టీవీఎస్ సుదాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్లికోట నుంచి పార్వతీపురం వయా కొమరాడ స్కూల్ పిల్లలకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయాలని కొమరాడ మండలం నుంచి వినతిపత్రం వచ్చిందని చెప్పారు. 3 స్టాప్ సర్వీసుకు సీతానగరంలో స్టాప్ ఏర్పాటు చేయాలని, అజ్జాడ గ్రామానికి అదనంగా మధ్యాహ్నం 2 గంటలకు బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని సీతానగరం మండలం నుంచి వినతి వచ్చిందన్నారు. విశాఖపట్నానికి బస్సు సర్వీసులు పెంచాలని, పార్వతీపురం నుంచి బత్తిలి వయా గుమ్మలక్ష్మీపురం బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని గుమ్మలక్ష్మీపురం నుంచి వినతులు వచ్చాయన్నారు. తోటపల్లి హైస్కూల్ నుంచి గిజబ, సింగనాపురం వెళ్లే విద్యార్థులకు సాయంత్రం సమయంలో తోటపల్లిలో బస్సు ఆపాలని తోటపల్లి నుంచి, పార్వతీపురం నుంచి ఉదయపురం, జి.శివడ గ్రామాలకు బస్సు ఏర్పాటు చేయాలని, లగేజీ ఉన్నప్పుడు కొంతమంది సిబ్బంది అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదు వచ్చిందన్నారు. బలిజిపేట మండల కేంద్రం నుంచి బొబ్బిలి, విశాఖపట్నానికి బస్సులు ఏర్పాటు చేయాని వినతి వచ్చినట్లు వివరించారు.

పంపిణీకి సిద్ధంగా సంపూర్ణ పోషకాహార కిట్‌లు



సీతానగరం అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార సరుకులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రసాద్, ఎంఈఓ సూరిదేముడు

సీతానగరం: మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార కిట్‌లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఎంఈఓ1 జి.సూరిదేముడు అన్నారు. ఈ మేరకు బుధవారం వివిధ గ్రామాల్లో పని చేస్తున్న అంగన్వాడీ కేంద్రాలను ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఎంఈఓ-1, ఎంఈఓ-2 జి సూరిదేముడు, ఎంవీ రమణ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ పూర్ణిమలు పరిశీలించి పౌష్టికాహారం పంపిణీని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీతానగరం అంగన్వాడీ కేంద్రంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం వద్ద అసంపూర్తిగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు కోరుతూ ఈ నెల 12 నుంచి చేస్తున్న నిరవధిక సమ్మె కారణంగా మూతపడిన అంగన్వాడీ కేంద్రాలను పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేయడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టిసారించామని తెలిపారు. ఈ నేపథ్యంలో ఐసీడీఎస్ అధికార, సిబ్బంది ఆధ్వర్యంలో కేంద్రాలు తెరిచి పిల్లల ఆకలి తీర్చడానికి పౌష్టికాహారం ప్రతిరోజూ పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఈ మేరకు అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల స్థానంలో అర్హత కలిగిన వలంటీర్లను నియమించి సెంటర్లను తెరిపించి పౌష్టికాహారం అందించనున్నట్లు తెలిపారు. అలాగే కొంతమంది అంగన్వాడీ కార్యకర్తలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడానికి కేంద్రం తాళాలు ఇవ్వక పోవడంతో కొంతవరకు అసౌకర్యానికి గురి కావలసి వచ్చిందన్నారు.

పేదలకు ఆరోగ్యశ్రీ ఓ వరం



ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోనుగౌరీశ్వరి

పార్వతీపురంటౌన్: పేదలకు ఆరోగ్యశ్రీ ఓ వరమని మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అన్నారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం పట్టణంలో జరిగిన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఎంతోమంది పేదల జీవితాల్లో ప్రభుత్వం వెలుగులు నింపిందన్నారు. ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ సేవలు వర్తింపజేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, అందులో భాగంగా ఆరోగ్యశ్రీ చికిత్స పరిమితిని రూ.25లక్షలకు పెంచిందన్నారు. పేదల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం శ్రద్ధచూపడం అభినందనీయమన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పీవీటీజీ గ్రామాలకు విద్యుత్ సౌకర్యం

పార్వతీపురం: పర్టిక్యులర్లీ వల్నర్‌బుల్ ట్రైబల్ గ్రూప్(పీవీటీజీ) గిరిజన ఆవాసాలకు విద్యుత్‌తీకరణకు సర్వే నిర్వహిస్తున్నట్లు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) సంచాలకుడు బి.రమేష్ బుధవారం తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్‌తో మాట్లాడుతూ విద్యుద్దీకరణ దాదాపు పూర్తయిందని, ఇంకా విద్యుద్దీకరణ లేని గ్రామాలుంటే అక్కడ పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా పార్వతీపురంలో పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించామని వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ ఎం.లక్ష్మణరావు, ఈఈ డి.ఫణికుమార్, డీఈ కె. వెంకటరత్నం తదితరులున్నారు.

జగనన్న పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: జననేత, ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలను నియోజకవర్గంలో గురువారం ఘనంగా నిర్వహిద్దామని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని ఆయన స్వగృహంలో నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పఎట్టణంలో తన ఆధ్వర్యంలో నిర్వహించనున్న అనాథాశ్రమంలో అన్నదానం, పేదలకు వస్త్రాలు, దుప్పట్ల పంపిణీ, ఏరియా ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ తదితర పలు సేవా కార్యక్రమాల ఏర్పాట్లపై సమీక్షించారు. పట్టణం, గ్రామాల్లో జగన్‌మోహన్ రెడ్డి జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పార్టీ నాయకులను సూచించారు.

డిప్యూటీ సీఎం పరామర్శ



నల్లి శ్రీనును పరామర్శిస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: సాక్షి ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్ నల్లి శ్రీను తల్లి సీతమ్మ మరణించడంతో బుధవారం పట్టణంలోని నల్లి శ్రీను ఇంటికి వెళ్లి ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర పరామర్శించారు. శ్రీనును ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, ఏఎంసీ వైస్‌చైర్మన్ బంకురు శ్రీనివాసరావు, మీడియా సభ్యులు బాలివిశ్వేశ్వరరావు, కె.రామ్మోహన్, తవిటి నాయుడు, తనూజ్ తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరిపై పర్యావరణ పరిరక్షణ బాధ్యత

- మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

పార్వతీపురంటౌన్: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన పర్యావరణ అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలుష్యం పెరగడం, ప్లాస్టిక్ వాడకం ఎక్కువ కావడం వల్ల అడవులను నరికి వేయడం వల్ల, వాహనాలు పెరగడం వల్ల భూ ఉష్ణోగ్రతలలో తీవ్రమైన మార్పులు సంభవిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని పిలుపునిచ్చారు. విద్యార్థి దశనుంచి విద్యార్థులంతా పర్యావరణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రజలంతా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణ హిత పద్ధతులను పాటించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డి.నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.